ఎన్నో ప్రాజెక్టులను పూర్తి చేశాం

అడ్డగుట్ట: సికింద్రాబాద్ నియోజకవర్గంలో కాగితాలకే పరిమితమైన ఎన్నో ప్రాజెక్టులను పూర్తి చేశామని సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం అడ్డగుట్ట ఏ, బీ సెక్షన్లు, శాస్త్రి నగర్, వెంకట్‌నగర్, సాయి నగర్, ఇంద్రలక్ష్మి నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. పద్మారావుగౌడ్ మాట్లాడుతూ అడ్డగుట్ట రూపు రేఖలను మార్చిన ఘనత తమదేనని అన్నారు. తుకారాంగేట్ ఆర్‌యూబీ తమ హయాంలోనే నిర్మించి ప్రారంభించామని, సికింద్రాబాద్‌ను అన్ని రంగాల్లో అగ్ర స్థానంలో నిలుపుతున్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత రెడ్డి, త్రినేత్ర గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో .. కిలో టమాటా రూ. 21, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 28, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 26, పందిరి బీర 23, క్యాబేజీ 13, క్యారెట్ 29, దొండ 13, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55.



లష్కర్‌లో త్రిముఖ పోటీ

- జీసీ నేతలకు ప్రాధాన్యమిచ్చిన పార్టీలు
- రెండు రోజుల్లో హోరాహోరీ ప్రచారాలు

సికింద్రాబాద్: బీజేపీ అభ్యర్థిత్వాలు ఖరారు కావడంతో సికింద్రాబాద్ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకొంది. త్వరలో జరుగనున్న శాసనసభన్నికలకోసం గత నెలలోనే అధికార బీఆర్ఎస్ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. రెండు వారాల క్రితం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆదం సంతోష్‌కుమార్‌ను అభ్యర్థిగా ఖరారు చేసింది. తీవ్ర ఉత్కంఠ అనంతరం బీజేపీ అధిష్టానం మేకల సారంగపాణిని ప్రకటించింది. దీంతో సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు జరిగే ఎమ్మెల్యే ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎంపిక పూర్తయింది. బీజేపీ అభ్యర్థిత్వం కోసం చివరి క్షణం వరకు జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బండకార్తీకారెడ్డి పోటీపడ్డప్పటికీ పార్టీ అధిష్టానం మాత్రం బీసీ నేతకు ప్రాధాన్యత ఇచ్చినట్టు తెలుస్తుంది.

ముగ్గురూ బీసీ నేతలే...

నియోజకవర్గంలో మూడు ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు బీసీవర్గాలకు చెందినవారు కావడం గమనార్హం. బీఆర్ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ ఎన్నికల ప్రచారంలో ముందుండగా ఇటీవలే టికెట్ దక్కించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి దీటైన ప్రచారం కోసం కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. తాజాగా బీజేపీ అభ్యర్థిత్వం ఖరారు కావడంతో రెండు మూడు రోజుల్లోనే మూడు ప్రధాన పార్టీల అభ్యర్థుల హోరాహోరీ ప్రచారంతో లష్కర్ వీధులు మార్మోగనున్నాయి.

ఎవరి ధీమా వారిది...

తాను రెండు మార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలు తనను సునాయసంగా గెలిపిస్తాయన్న ధీమాతో బీఆర్ఎస్ అభ్యర్థి టీ.పద్మారావుగౌడ్ ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెల్లుబుకుతున్న ప్రభుత్వ ప్రజా వ్యతిరేకత నియోజకవర్గంలో తనకు కలిసి వస్తుందన్న ధీమాలో కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్ ఉన్నారు. అదీకాకుండా నియోజకవర్గంలో బలంగా ఉన్న మైనారిటీ ఓట్లలో తను కూడా వాటా సాధించుకునేందుకు శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా బీజేపీ టికెట్ చేజిక్కించుకున్న మేకల సారంగపాణి మాత్రం గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ సాధించుకున్న ఓట్లు తిరిగి సాధించి, ముదిరిజుల అండదండలతో విజయం సాధించాలన్న పట్టుదలతో ఉన్నారు.

సికింద్రాబాద్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి

ప్రొఫైల్



పేరు: మేకల సారంగపాణి
వయసు: 59 సంవత్సరాలు
విద్యార్హత: బీఏ డిగ్రీ
వృత్తి: రాజకీయం
ప్రవృత్తి: రియల్ ఎస్టేట్ వ్యాపారం
నివాసం: మధురానగర్ సీతాఫల్‌మండి
రాజకీయ అనుభవం: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీల రాజకీయాల్లో ఉన్నారు. సిటీ టీడీపీ ప్రధాన కార్యదర్శిగా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా పోటీ చేశారు.
కుటుంబ నేపథ్యం: భార్య మేకల సుజాత 2002లో టీడీపీ ఎంసీహెచ్ కార్పొరేటర్‌గా పనిచేశారు. కుమారుడు మేకల హర్షకిరణ్, కోడలు మేకల కీర్తి బీజేపీ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు.

సనత్‌నగర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి

ప్రొఫైల్



పేరు: మర్రి శశిధర్‌రెడ్డి
తండ్రి: మర్రి చెన్నారెడ్డి
వృత్తి: రాజకీయం
విద్యార్హత: ఎంఎస్ (యూఎస్ఏ)
కుటుంబ నేపథ్యం: భార్య ఇందిరారెడ్డి, కుమారులు పురురవారెడ్డి, ఆదిత్యారెడ్డి, కుమార్తె హేమ్..
రాజకీయ నేపథ్యం: మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి వారసుడిగా రాజకీయ అరంగేట్రం చేశారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడంతో పాటు కాంగ్రెస్ పార్టీలో ఎన్నో పదవులు నిర్వర్తించారు. ఏపీసీసీ జాయింట్ సెక్రటరీగా, ప్రధాన కార్యదర్శిగా ఏఐసీసీ సభ్యుడిగా, ఎన్నికల కమిటీ సభ్యుడిగా, టీపీసీసీ ఎన్నికల కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్‌గా, ఏఐసీసీ టాస్క్‌ఫోర్స్ కన్వీనర్‌గా పనిచేశారు. గత కొన్ని నెలల క్రితం బీజేపీలో చేరిన ఆయన ఆ పార్టీ తరుపున సనత్‌నగర్ నుంచి బరిలో దిగుతున్నారు.

సాంప్రదాయేతర ఇంధన వనరులపై దృష్టి సారించాలి

- స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు



ఐఏఎస్ఎస్ఐ వార్షిక సదస్సులో పాల్గొన్న వక్తలు

సనత్‌నగర్: భవిష్యత్తు అవసరాల మేరకు సాంప్రదాయేతర ఇంధన వనరులపై దృష్టి కేంద్రీకరించాలని ఆర్థిక, ప్రణాళిక విభాగం స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు అన్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సోషల్ సైన్స్ ఇనిస్టిట్యూషన్స్ (ఐఏఎస్ఎస్ఐ) 22వ వార్షిక సదస్సు గురువారం బేగంపేటలోని సెస్ ఆడిటోరియంలో జరిగింది. సెస్ భాగస్వామ్యంతో మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సు ప్రారంభ కార్యక్రమానికి అతిథిగా హాజరైన రామకృష్ణారావు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా దృష్ట్యా ఇంధన వనరుల కొరత ఏర్పడే ప్రమాదం లేకపోలేదన్నారు. ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా దేశం అభివృద్ధి చెందుతున్న క్రమంలో పర్యావరణ పరిరణకు ఉద్యమించాలన్నారు. ఐసీఎస్ఎస్ఆర్ సభ్య కార్యదర్శి ఆచార్య ధనుంజయ్‌సింగ్ మాట్లాడుతూ 2035 సంవత్సరం నాటికి పట్టణ ప్రాంత జనాభా 43.2 శాతానికి చేరుకునే అవకాశం ఉందని, ఆ మేరకు విద్య, ఆరోగ్య, పారిశుధ్యం, పేదరిక నిర్మూలన, ఉద్యోగ కల్పన అంశాలపై ప్రణాళికలు రూపొందించాలన్నారు. సదస్సు అధ్యక్షులు ఆచార్య ఎస్.మహేంద్రేవ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఐఏఎస్ఎస్ఐ చైర్‌పర్సన్ ఆచార్య సచిన్ చతుర్వేది, కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ సమస్యలు పరిష్కరించాలి

అడ్డగుట్ట: కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ తల్లుల సంఘం ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు తల్లుల సంఘం ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించి పిల్లలను పని నుండి విముక్తి చేశామన్నారు. అనంతరం, వారికి వివిధ కేజీబీవీ హాస్టల్స్‌లో చేర్పించినట్లు తెలిపారు. వారి స్థితిగతులు తెలుసుకోవడానికి గత నెల 21న యాచారం, మంచాల, మహేశ్వరం, కందుకూరులలోని కేజీబీవీ హాస్టళ్లను సందర్శించామని, అక్కడ విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో సంఘం ప్రతినిధులు జీ. భాగ్యలక్ష్మి, సాయిలక్ష్మి, వేణు, లక్ష్మీనారాయణలు ఉన్నారు.

స్కేటింగ్ క్రీడాకారుడికి పలువురి అభినందన



రాంగోపాల్‌పేట్: చైనాలో గత నెల 22వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగిన 19వ ఏషియా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో వెస్ట్ మారేడుపల్లికి చెందిన చలంచర్ల జుహిత్‌కు స్వర్ణ పతకం దక్కింది. ఈ పోటీల్లో తెలంగాణా నుంచి 15 సంవత్సరాల చలంచర్ల జుహిత్ పాల్గొన్నాడు. సోలో డాన్స్‌మెన్ కాడెట్స్ విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు. అలాగే సీనియర్స్ విభాగంలోనూ జుహిత్ ద్వితీయ స్థానంతో రజత పతకం సాధించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించిన జుహిత్‌ను కుటుంబ సభ్యులతో పాటు కోచ్‌లు అభినందనలతో ముంచెత్తారు.

చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి

రసూల్‌పురా: విద్యతో పాటు క్రీడలకు విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలని.. ఆ దిశగా వారి తల్లితండ్రులు ప్రోత్సాహం అందించాలని బ్రిగేడియర్ ఏటిసి కమాండెంట్ అజేక్దాదా పాండే కోరారు. పికెట్ కేంద్రీయ విద్యాలయంలో గురువారం అండర్ 14 జాతీయ స్థాయి ఖో-ఖో పోటీలను పాండే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులు ఆల్‌రౌండ్ ప్రతిభ కనబర్చాలని కోరారు. తాను కూడా క్రీడాకారుడినని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ రూపేందర్ సింగ్ మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక ధృడత్వం తో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. జాతీయస్థాయిలో ఖోఖో పోటీలకు పికెట్ కేంద్రీయ విద్యాలయం ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉందని అన్నారు. దేశం లోని 24 కేవీ పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని చెప్పారు. ఈ సందర్భంగా చైనా బీజింగ్‌లో జరిగిన ఏషియన్ స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన ఇద్దరు విద్యార్థులను బ్రిగేడియర్ పాండే. ప్రిన్సిపల్ రూపేందర్‌సింగ్‌లు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చౌహాన్



మాట్లాడుతున్న మాజీ సీఎం అశోక్ చౌహాన్

అడ్డగుట్ట: సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పరిశీలకుడు, మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చౌహాన్ ధీమా వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్‌తో ఆయన గురువారం రాత్రి తుకారాంగేట్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాజీ సీఎం అశోక్ చౌహాన్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ అవినీతి పాలనతో విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. ఆ మార్పు కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమౌతుందనే ఆలోచనలో ఉన్నారన్నారు. తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధిని పట్టించుకోని బీఆర్ఎస్ పార్టీకి ఈ సారి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు అనిల్ యాదవ్, మహేష్ గౌడ్, అభి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలి

బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందితతో మంత్రి తలసాని

కంటోన్మెంట్: కంటోన్మెంట్ నియోజకవర్గంలో తమ పార్టీ అత్యంత బలీయమైన శక్తిగా కొనసాగుతుందని, పార్టీ అభ్యర్థి లాస్య నందిత గెలుపు లాంఛనమేనని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం దివంగత నేత సాయన్న నివాసంలో అభ్యర్థి లాస్య నందిత, అదనపు ఇంచార్జ్ గజ్జెల నాగేశ్‌లతో కలిసి నియోజకవర్గ ముఖ్య నేతలు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు వార్డులకు సంబంధించిన కార్యకర్తలు తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూ మంత్రికి ఫిర్యాదు చేశారు. సమన్వయ లోపాలు ఉన్న వార్డులపై ప్రత్యేక దృష్టి సారించి అందరినీ కలుపుకుని ముందుకు సాగాలంటూ లాస్యకు సూచించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ లాస్యనందిత చేపట్టిన మొదటివిడత పాదయాత్రకు అద్భుత స్పందన లభించిందన్నారు. శుక్రవారం నుంచి మరింత ఉధృతంగా గులాబీ ప్రచారం కొనసాగుతుందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందితతో పాటు పార్టీ శ్రేణులంతా ఎక్కడికక్కడ ప్రచారాన్ని ముమ్మరం చేయాలని సూచించారు. ఈనెల 9న నామినేషన్ కార్యక్రమం ఉంటుందని.. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి అందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. దీపావళి తర్వాత ప్రతి వార్డులోనూ పార్టీ ఆఫీసులను ప్రారంభించి ప్రచారాన్ని మరింత ఉధృతం చేయాలన్నారు.

అసెంబ్లీలో ఐదోసారి అడుగుపెట్టేనా?

సనత్‌నగర్ బీజేపీ టికెట్ దక్కించుకున్న మర్రి శశిధర్ రెడ్డి



సనత్‌నగర్: బీజేపీ సనత్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి పేరును అధిష్టానం ఖరారు చేసింది. గురువారం విడుదలైన బీజేపీ అభ్యర్థుల మూడో జాబితాలో ఆయనకు స్థానం దక్కింది. ఇంతవరకు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఉన్న మర్రి శశిధర్‌రెడ్డి ఇపుడు ఐదోసారి కూడా అసెంబ్లీలో అడుగు పెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల వరకు కాంగ్రెస్ కుటుంబంలో ఒకరిగా ఉన్న మర్రి శశిధర్‌రెడ్డి..తొలిసారిగా బీజేపీ నుంచి బరిలోకి దిగుతున్నారు. సనత్‌నగర్ నుంచి ఆయన నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. మొదటి సారిగా 1992లో జరిగిన ఎన్నికల్లో గెలుపొంది సైన్స్ అండ్ టెక్నాలజీ మినిస్టర్‌గా పనిచేశారు. ఆ తరువాత 1994, 2004, 2009లలో జరిగిన సాధారణ ఎన్నికల్లో గెలుపొందారు. 2010 నుంచి 2014 వరకు మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ చైర్మన్‌గా ఉన్న ఎన్‌డీఎంఏ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ)కి వైస్‌చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ సమయంలో ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడంపై సుదీర్ఘ అధ్యయనం చేసి పలు రాష్ట్రాల్లో సత్ఫలితాలను తీసుకువచ్చారు. నియోజకవర్గంలో వివాదరహితుడిగా పేరుగడించారు. అయితే పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వైఖరిని నిరసిస్తూ కొన్ని నెలల క్రితం బీజేపీలో చేరారు. మరి ఓటరు తీర్పు ఎలా ఉంటుందో చూడాలి.

అభివృద్ధి అంటే భూముల ధరలు పెంచి అమ్ముకోవడమేనా ..!



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ శ్రీరామ్ వెంకటేష్

లాలాపేట: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో హైదరాబాద్‌లో సామాన్యుడు గజం భూమిని కూడా కొనలేని పరిస్థితికి కారణమైన సీఎం కేసీఆర్‌కు ఎందుకు ఓటు వేయాలో ప్రజలందరూ ఆలోచించాలని హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ శ్రీరామ్ శివకుమార్ అన్నారు. భూముల ధరలు పెంచి ప్రైవేట్ కంపెనీలకు అమ్ముకోవడమేనా అభివృద్ధి అని ఆయన ప్రశ్నించారు. గురువారం తార్నాకలో సికింద్రాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలు మార్పు కోరుకొంటున్నారని రాష్ట్రంలో బిఆర్ఎస్ వేవ్ లేదన్నారు, ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలను గెలుచుకుని అధికారంలోకి రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వంగ ఉపేందర్, ఎస్. రామ్‌లాల్, కిషన్, కిషోర్, డా. సత్యం, బెల్లంకొండ మానయ్య, సుధాకర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మానవతా రాయ్‌కు కాంగ్రెస్ టిక్కెట్ ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థి ఉద్యమ నేతలకు టిక్కెట్లు ఇస్తామని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ గతంలో ఇచ్చిన మేరకు మానవతా రాయ్‌కి టిక్కెట్ ఇవ్వాలని జేఏసీ నాయకులు కొప్పుల ప్రతాప్‌రెడ్డి, బైరు నాగరాజుగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం యూనివర్సిటీ లైబ్రరీ ఎదుట విద్యార్థులు ఆందోళన చేశారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమ నేత కోటూరి మానవతా రాయ్ ఎన్ఎస్‌యూఐ, నిరుద్యోగుల సమస్యల పై అనేక పోరాటాలు చేసి జైలుకు వెళ్లారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరి గత 15 సంవత్సరాలుగా ప్రజలకు సేవలందిస్తున్న మానవతరాయ్‌కి ఖమ్మం జిల్లా సత్తుపల్లి టిక్కెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు.

సాయన్న చేసిన అభివృద్ధే గెలిపిస్తుంది



ప్రచారం నిర్వహిస్తున్న నివేదిత, నాగేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ నియోజకవర్గంలో సాయన్న చేసిన అభివృద్ధే లాస్య నందితను గెలిపిస్తుందని బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి, తన సోదరి లాస్య నందికు మద్దతుగా కంటోన్మెంట్ నాలుగో వార్డు పాదయాత్ర నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల అదనపు ఇంచార్జ్ గజ్జెల నాగేశ్, బోర్డు మాజీ సభ్యురాలు నళిని కిరణ్‌లతో కలిసి లక్ష్మీ నగర్, ఎంఈఎస్ కాలనీ, రైల్వే కాలనీ, ఆకుల నారాయణ కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు.

ఓయూ పీజీ తరగతులు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీజీ తరగతులు ప్రారంభమయ్యాయి. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశాల పక్రియ ముగిసిన తర్వాత ఈ నెల 1 నుంచి ఆయా విభాగాలలో బోధన ప్రారంభమైంది. అనేక విభాగాలలో అధ్యాపకుల కొరత వలన ఒకటి రెండు క్లాస్ మాత్రమే అవుతున్నాయి. క్యాంపస్‌లో కాలేజీల కంటే అనుబంధ కళాశాలలో తీవ్రమైన అధ్యాపకుల కొరత ఉంది. అధ్యాపకుల కొరతను తాత్కాలికంగా తీర్చేందుకు పార్ట్‌టైం బోధకులను నియమిస్తున్నారు. కొన్ని విభాగాలలో పార్ట్‌టైం అధ్యాపకుల నియామకంలో జాప్యం వలన తరగతులు జరగడం లేదని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. ఓయూ వీసీ ప్రొ.రవిందర్ ఇతర కార్యక్రమాలతో పాటు బోధన పై దృష్టి సారించాలని విద్యార్థి సంఘాల నేతలు విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి, సంక్షేమం చూసే బీఆర్ఎస్‌లోకి వలసలు

సనత్‌నగర్: అభివృద్ధి, సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు హారతులు పడుతూ తమ పార్టీలోకి వలసలు వస్తున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బేగంపేట డివిజన్ ఎస్‌బీటీనగర్, వడ్డెరబస్తీ, రాంగోపాల్‌పేట డివిజన్ విక్టోరియాగంజ్‌లకు చెందిన పలువురు గురువారం మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ తొమ్మిదిన్నర ఏళ్ళల్లో నియోజకవర్గంలో ఎవరూ ఊహించని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్, నాగరాజుగౌడ్, అర్జున్, భరత్, అరుణ్, సందీప్, రాజేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆల్‌సోల్స్‌డే



పద్మారావునగర్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో గురువారం క్రైస్తవులు ఆల్‌సోల్స్‌డే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని పలు క్రైస్తవ శ్మశానవాటికల్లో తమ కుటుంబీకులను జ్ఞాపకం చేసుకున్నారు. కొవ్వొత్తులను వెలిగించి చనిపోయిన తమ కుటుంబీకులను తలుచుకొని ప్రార్థనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన జనంతో సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి రోడ్డు జన సంద్రంగా మారింది దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఆల్‌సోల్స్ డే సందర్భంగా క్రైస్తవ శ్మశానవాటికలను విద్యుత్తు దీపాలతో అందంగా అలంకరించారు.

గ్రేటర్‌లో బీఆర్ఎస్‌దే విజయం: మంత్రి తలసాని



పద్మారావును కలిసి ఓటు అడుగుతున్న మంత్రి శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: గ్రేటర్ హైద్రాబాద్‌లో బీఆర్ఎస్ మెజారిటీ స్థానాలు కైవసం చేసుకుంటుదని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మోండా మార్కెట్ డివిజన్‌లో గురువారం ఇంటింటికీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సుమారు మూడు గంటల పాటు డివిజన్‌లోని ఆదయ్యనగర్, సాంబమూర్తినగర్, గాస్‌మండి, టకారబస్తీ ప్రాంతాల్లో అట్టహాసంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఘన స్వాగతం పలికారు.

ఓటు వేయాలని డిప్యూటీ స్పీకర్‌కు అభ్యర్థన...

ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ టకరాబస్తీలో పర్యటించారు. డిప్యూటీ స్పీకర్ టి. పద్మారావు ఇల్లు అక్కడే ఉండటంతో తన కుమారుడు తలసాని సాయికిరణ్ యాదవ్‌తో కలిసి తనకు ఓటు వేయాలని డిప్యూటీ స్పీకర్ టి. పద్మారావును అభ్యర్థించారు. ఇరువురు కూడా అప్యాయంగా పలకరించుకున్నారు.

లాస్యనందితను గెలిపించాలంటూ ప్రచారం



రెజిమెంటల్‌బజార్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నరసింహారావు ముదిరాజ్

రాంగోపాల్‌పేట్: కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందితను గెలిపించి అభివృద్ధికి బాటలు వేయాలని జీహెచ్ఎంసీ కోఆప్షన్ మాజీ సభ్యులు నరసింహారావు ముదిరాజ్ అన్నారు. గురువారం సీనియర్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రెజిమెంటల్‌బజార్, ఆర్య వైశ్యా సంఘం, తాతాచారి కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తిరుగతూ ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అశోక్ ముదిరాజ్, సతీష్, రాము, ప్రవీణ్, కిష్టఫర్, సాయి, గోపిబాబు, నవీన్, సందీప్ కుమార్, పరశురాం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి



పీజీరోడ్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్

రాంగోపాల్‌పేట్: సనత్‌నగర్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ అన్నారు. గురువారం ఆమె పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కృష్ణానగర్‌కాలనీ, జవహార్‌నగర్‌కాలనీ, లక్ష్మీనారాయణ అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ పీజీరోడ్‌లోని వివిధ కాలనీల్లో కొన్ని దశాబ్దాలుగా అనేక సమస్యలు ఉండగా గత 10 ఏళ్లలో తలసాని శ్రీనివాస్‌యాదవ్ వాటిని పరిష్కరించారు. రోడ్లు, డ్రైనేజీ, మంచినీళ్లు తదితర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించారని చెప్పారు. మరోమారు తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతారని ఆమె అన్నారు. సతీష్, గణేష్, కోటేశ్వర్‌గౌడ్, కస్తూరి, ఝాన్సీ పాల్గొన్నారు.

నామినేషన్ల ఘట్టానికి ఏర్పాట్లు పూర్తి

- సనత్‌నగర్ నియోజకవర్గంలో నేటినుంచి నామినేషన్ల స్వీకరణ
- సికింద్రాబాద్ జోనల్ కార్యాలయం మూడో అంతస్తులో ఆర్వో కార్యాలయం..
- అభ్యర్థితో పాటు మరో నలుగురికి అనుమతి..
- నామినేషన్ల తంతు కెమెరాలో బంధించేందుకు ఏర్పాట్లు..



సనత్‌నగర్
ఆర్వో కిషన్‌రావు

సనత్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. పోటీలో నిలిచే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేసినట్లు సనత్‌నగర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కిషన్‌రావు స్పష్టం చేశారు. ఈ మేరకు నామినేషన్ల ప్రక్రియ, నామినేషన్ వేసే వారు పాటించాల్సిన నియమ నిబంధనలను ఆయన వివరించారు.

సికింద్రాబాద్ జోనల్ కార్యాలయ భవనం మూడో ఫ్లోర్‌లో..

సికింద్రాబాద్ జోనల్ కార్యాలయ భవనం మూడో అంతస్తులో రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. నియోజకవర్గ బరిలో నిలవాలనుకునేవారు ఇక్కడే నామినేషన్లను అందించాల్సి ఉంటుంది. నామినేషన్ల ప్రక్రియ దృష్ట్యా అన్ని వైపులా సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. నామినేషన్ తంతును కెమెరాలో బంధించేందుకు ప్రత్యేకంగా కెమెరామెన్‌ను అందుబాటులో ఉంచారు. ఆర్వో కార్యాలయం భవనానికి 100 మీటర్ల దూరంలోనే అభ్యర్థుల వాహనాలను నిలిపివేస్తారు. అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే అనుమతిస్తారు. ఈ సందర్భంగా అక్కడ బారికేడ్లను ఏర్పాటుచేసి ఎవరూ ఆర్వో కార్యాలయం వైపు రాకుండా నోడల్ అధికారి, ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు.

10వ తేదీన మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరణ..

ఎన్నికల్లో పోటీ చేయదలచుకున్న వారి కోసం నామినేషన్ పత్రాలను ఆర్వో కార్యాలయంలో అందుబాటులో ఉంచారు. పత్రాల్లో అడిగిన అన్ని వివరాలుఇవ్వాలి. ఏదైనా తమకు వర్తించదనుకుంటే నిల్, నాట్ అప్లికబుల్ అని రాయాలే గానీ ఖాళీగా ఉంచకూడదన్నారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య సమర్పించాల్సి ఉంటుందన్నారు. చివరి రోజు 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటల లోపు కార్యాలయం ఆవరణలోకి వచ్చిన వారి నామినేషన్లను మాత్రమే తీసుకుంటామన్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసే నాటికి ఫారం ఏ, బీలను తప్పనిసరిగా సమర్పించాలి. కొన్నింటిని స్క్రూటినీ నాటికి సమర్పించినా ఫరవాలేదన్నారు.

15వ తేదీ తరువాత గుర్తుల కేటాయింపు..

నామినేషన్ల స్వీకరణ ముగిసిన తరువాత రోజు అంటే 11 నుంచి 15వ తేదీ వరకు ఉపసంహరణ గడువు ఉంటుంది. అనంతరం ఎవరెవరు బరిలో ఉంటారనేది స్పష్టత వస్తోంది. ఆ వెంటనే బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తులను కేటాయిస్తారు. గుర్తింపు పొందిన పార్టీలు, రిజిస్టర్ పార్టీలు, స్వతంత్రుల వారీగా గుర్తుల కేటాయింపు జరుగుతుంది. స్వతంత్ర అభ్యర్థుల గుర్తుల కేటాయింపులో ఇద్దరూ ఒకే గుర్తును కోరుకుంటే నిబంధనల మేరకు అందరి సమక్షంలో లాటరీ ద్వారా గుర్తును కేటాయిస్తారు.

క్రైస్తవుల సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి

పద్మారావునగర్: క్రైస్తవుల సంక్షేమం, అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేసిందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆల్‌సోల్స్ డే సందర్భంగా గురువారం సాయంత్రం బోయిగూడలోని క్యాథలిక్ సిమెంటరీ చర్చిని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా మేరీ మాత విగ్రహానికి పూల మాల వేశారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ చర్చిలు, గ్రేవ్ యార్డుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.